PRGI NO: TGTEL/26/A0383
డైనమిక్ జనంవాయిస్
తెలుగు దినపత్రిక
నిజం మా మాట | న్యాయం మా ధ్యేయం | ప్రజల కోసం మా ప్రయాణం
తెలంగాణ ఆదివారం 13-09-2026 సంపుటి: 01 సంచిక: 240 పేజీలు: 12


## నా సినిమాలను నేను చూడలేను: ప్రీతి జింటా

కొంత విరామం తర్వాత గ్రాండ్ రీఎంట్రీ ఇస్తున్న ప్రీతి జింటా. స్క్రీన్ పై తనను తాను చూసుకోవడం ఇబ్బందికరంగా ఉంటుందని వెల్లడి. సీన్ ఇంకా బాగా చేసి ఉంటే బాగుండేదని అనిపిస్తుందన్న ప్రీతి.



## తెలంగాణలో ఆగని వానలు..

మరో వారం పాటు వర్ష సూచన.
తెలంగాణలో మరో వారం పాటు వర్షాలు కొనసాగింపు.
రానున్న 24 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్ష సూచన.
ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో కుండపోత వానల అంచనా.
సీజనల్ వ్యాధులపై ప్రజారోగ్య శాఖ ప్రత్యేక హెచ్చరికలు జారీ.
హైదరాబాద్‌లోనూ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం.



## బర్తరఫ్ తర్వాత కీలక పరిణామం.. కొండా సురేఖకు ఢిల్లీ నుంచి పిలుపు

మంత్రి పదవి కోల్పోయిన కొండా సురేఖకు ఢిల్లీ నుంచి పిలుపు.
వెంటనే రావాలంటూ కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దల నుంచి సందేశం.
కేబినెట్ స్థాయి పదవి ఇచ్చే యోచనలో అధిష్ఠానం ఉన్నట్లు సమాచారం.
సురేఖతో నేరుగా మాట్లాడిన తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్.



## బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ.


కొండా సురేఖ తొలగింపుపై తలసాని శ్రీనివాస్ యాదవ్ వ్యంగ్యాస్త్రాలు.
తెలంగాణ భవన్‌లో 'నమూనా అసెంబ్లీ' నిర్వహించిన బీఆర్ఎస్.
సీఎం రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని వ్యంగ్యాస్త్రాలు.
మాజీ మంత్రి కొండా సురేఖ తొలగింపుపై తలసాని సెటైర్లు.
100 రోజుల హామీల అమలుపైనా చురకలు అంటించిన బీఆర్ఎస్.
అసెంబ్లీ నుంచి సస్పెన్షన్‌కు నిరసనగా ఈ కార్యక్రమం.





## యూట్యూబర్ రమానందనపై మరో కేసు

చీటింగ్ కేసులో యూట్యూబర్ రమానందనకు నోటీసులు.
లండన్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని రూ.10.50 లక్షలు వసూలు.
ప్రకాశం జిల్లా అద్దంకి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు.
ఈ నెల 17న విచారణకు హాజరు కావాలని ఆదేశం.
గతంలోనూ నందనపై పలు మోసం కేసులు.



# వినాయక మండపాలకు ఉచిత విద్యుత్.

గణేశ్ ఉత్సవాలపై సమీక్ష నిర్వహించిన రేవంత్ రెడ్డి
మండపాల నిర్వహకులు పోలీస్ స్టేషన్లలో సమాచారం ఇవ్వాలని సూచన
నిమజ్జనాలు చేసే చెరువుల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశం.



**జనం వాయిస్, హైదరాబాద్, సెప్టెంబర్ 12:**
వినాయక చవితి ఉత్సవాలను ఎక్కడా చిన్నపాటి అవాంఛనీయ సంఘటనకూ తావులేకుండా, వైభవంగా నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. పండుగ వేళ భక్తులకు, మండప నిర్వాహకులకు ఎదురయ్యే క్షేత్రస్థాయి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి స్వయంగా రంగంలోకి దిగారు. ఉత్సవ కమిటీలు, ప్రజాప్రతినిధులు, పోలీసు, మున్సిపల్ ఉన్నతాధికారులతో సచివాలయంలో ప్రత్యేకంగా భేటీ అయిన ఆయన... పండుగ నిర్వహణపై సమగ్ర సమీక్ష జరిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన తెలంగాణలోనే గణేశ్ మండపాలకు రూపాయి ఖర్చు లేకుండా ఉచిత విద్యుత్ అందిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు.

## ధరణి పేరుతో బీఆర్ఎస్ భూదందా

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.
బీఆర్ఎస్ హయాంలో ధరణి పేరుతో లక్షల ఎకరాల అక్రమాలు.
ధరణి తప్పిదాలతో వందల మంది రైతుల ఆత్మహత్యలు.
దివాలా తీసిన విదేశీ కంపెనీకి ధరణి నిర్వహణ బాధ్యతలు.
బండారం బయటపడుతుందనే బీఆర్ఎస్ నేతలు పారిపోతున్నారు.
పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబమే బాగుపడింది.
అసెంబ్లీలో మంత్రి తీవ్ర ఆగ్రహం.





## 25,000 క్యాబ్ డ్రైవర్ల సమ్మె.. శంషాబాద్‌లో ప్రయాణికులకు ఇబ్బందులు

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో నిలిచిపోయిన క్యాబ్ సేవలు.
సమ్మె బాట పట్టిన సుమారు 25,000 మంది డ్రైవర్లు.
ప్రభుత్వ జీవో 46 అమలు చేయాలని ప్రధాన డిమాండ్.
ఓలా, ఉబెర్, రాపిడో ఎయిర్‌పోర్ట్ రైడ్స్‌ను బహిష్కరించిన యూనియన్.
కిలోమీటర్‌కు రూ. 21 బదులు రూ. 12 మాత్రమే ఇస్తున్నారని ఆరోపణ.

## కొత్త రైళ్ల కొనుగోలుకు పచ్చజెండా

మెట్రో ప్రయాణికులకు శుభవార్త.
600 కోట్ల వ్యయంతో కొత్త రైళ్ల కొనుగోలు.
రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వ నిర్ణయం.



**జనం వాయిస్, హైదరాబాద్, సెప్టెంబర్ 12:**
హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. మెట్రో రైళ్లల్లో రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వం ముందడుగు వేసింది. ప్రస్తుతం పీక్ సమయాల్లో మెట్రోలలో విపరీతమైన రద్దీ ఉంటుంది. కనీసం నిల్చోవడానికి కూడా స్థలం ఉండటం లేదు. ఈ సమస్యతో మెట్రో ప్రయాణికులు ఎప్పటినుంచో ఇబ్బంది పడుతుండగా.. ఇప్పుడు పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధమైంది. రద్దీని తగ్గించేందుకు కొత్త రైళ్లను తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం కొత్త రైళ్లను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం రెడీ అవుతోంది. ఒక్కో రైల్లో 2 వేల మంది ప్రయాణించేందుకు వీలుగా 6 కోచ్‌ల రైళ్లను

## 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే తెలంగాణ లక్ష్యం: శ్రీధర్ బాబు

హైదరాబాద్ లో వికేంద్రీకృత నగర పాలనను అందుబాటులోకి తెస్తున్నామన్న శ్రీధర్ బాబు.
దీని కోసమే క్యూర్ యాక్ట్ 2026ను రూపొందించామని వెల్లడి.
హైదరాబాద్ ప్రపంచ స్థాయి మెట్రోపాలిటన్ సిటీగా ఎదిగిందన్న మంత్రి.



డైనమిక్ జనంవాయిస్ NEWS
తెలుగు దినపత్రిక
నిజం మా మాట | న్యాయం మా ధ్యేయం | ప్రజల కోసం మా ప్రయాణం
PRGI NO: TGTEL/26/A0383

# తెలంగాణలో ఆగని వానలు..

**జనం వాయిస్, హైదరాబాద్, సెప్టెంబర్ 12:**
తెలంగాణలో వర్షాల ఉద్ధృతి ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. వీటితో పాటు నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. హైదరాబాద్ నగరంలోనూ మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నాయి.

**ఆరోగ్య శాఖ హెచ్చరిక**
వర్షాల నేపథ్యంలో ఉష్ణోగ్రతలు తగ్గడం, గాలిలో తేమ శాతం పెరగడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ హెచ్చరించింది. ప్రధానంగా దోమలు, కలుషిత నీరు, గాలి ద్వారా వ్యాపించే అంటువ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. దోమతెరలు వాడటం, నివాస పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడటం, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగడం వంటి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరింది. ఎవరికైనా ఫ్లూ లక్షణాలు కనిపిస్తే జాప్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని అధికారులు స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ.

**జనం వాయిస్, హైదరాబాద్, సెప్టెంబర్ 12:**
కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ పార్టీ విమర్శనాస్త్రాలు సంధించింది. తమ ఎమ్మెల్యేలను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో 'మాక్ అసెంబ్లీ' నిర్వహించారు. ఈ వేదిక ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై, ప్రభుత్వ హామీల అమలుపై బీఆర్ఎస్ నేతలు తీవ్రస్థాయిలో వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఈ మాక్ అసెంబ్లీలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు స్పీకర్‌గా వ్యవహరించగా, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యమంత్రి పాత్రను పోషించి రేవంత్ రెడ్డిని అనుకరిస్తూ మాట్లాడారు. ఇటీవల మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించిన అంశాన్ని ప్రస్తావిస్తూ, "కొండా సురేఖ కుమార్తె నా గురించి మాట్లాడినందుకే ఢిల్లీకి వెళ్లి, మూడు రోజులు ఉండి, ఆమెను (సురేఖను) అణచివేసి వచ్చాను. బీసీ బిడ్డనైన నేను సీఎం అయ్యాక, ఆమెను కేబినెట్ నుంచి తీసేయక ఏం చేయగలను?" అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రకటించిన 100 రోజుల హామీలపైనా తలసాని చురకలంటించారు. "100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పాం కానీ, ఏ 100 రోజుల్లో అని చెప్పామా? ఢిల్లీలో మాకూ కొన్ని ఇబ్బందులు ఉంటాయి కదా" అంటూ ఎద్దేవా చేశారు. తమ పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల ప్రవర్తన, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆరోగ్యంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలపై చర్చకు పట్టుబట్టినందుకు గాను, సెప్టెంబర్ 9న కేటీఆర్ తో సహా 22 మంది ఎమ్మెల్యేలను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సస్పెండ్ చేశారు. ఈ సస్పెన్షన్‌కు నిరసనగానే బీఆర్ఎస్ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. కేటీఆర్‌తో పాటు ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్న ఈ వేదికపై, ప్రభుత్వం చర్చకు అనుమతించని ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు.

# యూట్యూబర్ రమానందనపై మరో కేసు

**జనం వాయిస్, హైదరాబాద్, సెప్టెంబర్ 12:**
లండన్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి మోసం చేసిన కేసులో ప్రముఖ యూట్యూబర్ రమానందనకు ప్రకాశం జిల్లా పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ నెల 17న విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. తన యూట్యూబ్ ఛానల్ 'నందూస్ వరల్డ్' ద్వారా నందన తెలుగు ప్రజలకు సుపరిచితురాలు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా అద్దంకి మండలం పేరాయపాలెంకు చెందిన శ్రీనివాసరావు అనే వ్యక్తి అద్దంకి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన కోడలికి లండన్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి, నందన తమ నుంచి రూ.10.50 లక్షలు వసూలు చేశారని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో చాలా మందికి ఉద్యోగాలు ఇప్పించానని చెప్పడంతో విడతల వారీగా ఈ మొత్తాన్ని ఆమెకు బదిలీ చేసినట్లు తెలిపారు. అయితే, ఉద్యోగం ఇప్పించకపోగా, తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో జులై 4న పోలీసులు నందనపై చీటింగ్ కేసు నమోదు చేశారు. నందనపై ఇలాంటి ఆరోపణలు రావడం ఇది మొదటిసారి కాదు. యూకేలో ఉద్యోగాలు, వీసాలు ఇప్పిస్తానని చెప్పి డబ్బులు వసూలు చేసినట్లు గతంలో ఎన్టీఆర్ జిల్లాలోనూ ఆమెపై కేసులు నమోదయ్యాయి. ఈ కేసులకు సంబంధించి జారీ అయిన లుక్‌అవుట్ నోటీసుల కారణంగా ఇటీవల హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆమెను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఈ మోసాలతో తనకు సంబంధం లేదని, తన భర్తే ఇలాంటి వ్యవహారాలు చూసుకుంటారని విచారణ సందర్భంగా ఆమె తెలిపారు. ప్రస్తుతం ప్రకాశం జిల్లా కేసులో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# నా సినిమాలను నేను చూడలేను: ప్రీతి జింటా

**జనం వాయిస్, హైదరాబాద్, సెప్టెంబర్ 12:**
ప్రముఖ బాలీవుడ్ నటి ప్రీతి జింటా కొంత కాలంగా సినిమాలకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. కొంత విరామం తర్వాత ఆమె 'వైబ్' అనే యాక్షన్ కామెడీ మూవీతో పాటు 'బట్వారా 1947' చిత్రం గ్రాండ్ రీఎంట్రీ ఇస్తోంది. 'వైబ్'లో ఆమె 'మేడమ్ హెచ్' అనే పవర్‌ఫుల్ సూపర్ స్పై పాత్రలో కనిపించనున్నారు. వంశిక ధీర్, కునాల్ ఖేము, స్పర్ష్ శ్రీవాస్తవ ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రం సెప్టెంబర్ 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా జరిగిన ప్రమోషన్లలో నటి వంశిక ధీర్ మాట్లాడుతూ... పెద్ద తెరపై తనను తాను చూసుకున్నప్పుడు 'ఇంపాస్టర్ సిండ్రోమ్' అనిపించిందని చెప్పగా, ప్రీతి జింటా ఆసక్తికరంగా స్పందించింది. ఇన్ని ఏళ్ల అనుభవం ఉన్నా, ప్రతి కొత్త పాత్ర చేసేటప్పుడు 'చేయగలనా, లేదా?' అనే సందేహం తనకూ వస్తుందని ఆమె చెప్పింది. "నేను నా సినిమాలను స్క్రీన్ పై ఎప్పుడూ చూడలేను. థియేటర్‌లో కూర్చోవడం చాలా ఇబ్బందిగా ఉంటుంది. సినిమా చూస్తున్నంతసేపు ఈ సీన్ ఇంకా బాగా చేసి ఉంటే బాగుండేది అనే ఆలోచనే వస్తుంది" అని ప్రీతి వెల్లడించింది.



# బర్తరఫ్ తర్వాత కీలక పరిణామం.. కొండా సురేఖకు ఢిల్లీ నుంచి పిలుపు

**జనం వాయిస్, హైదరాబాద్, సెప్టెంబర్ 12:**
మంత్రి పదవి నుంచి బర్తరఫ్ అయిన కొండా సురేఖ వ్యవహారంలో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. ఆమెకు కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి ఢిల్లీకి రావాల్సిందిగా పిలుపు అందింది. వెంటనే బయలుదేరి రావాలని పార్టీ పెద్దల నుంచి ఆమెకు సందేశం అందినట్లు తెలుస్తోంది. మంత్రివర్గం నుంచి తొలగించిన మరుసటి రోజే హైకమాండ్ రంగంలోకి దిగడం తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తి రేపుతోంది. నిన్న తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, కొండా సురేఖతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడారు. పార్టీ



నిర్ణయాన్ని గౌరవించాలని, అధిష్ఠానం అండగా ఉంటుందని ఆమెకు హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ సంభాషణ జరిగిన కొద్ది గంటల్లోనే ఢిల్లీ నుంచి పిలుపు రావడం గమనార్హం. మంత్రి పదవి కోల్పోయి అసంతృప్తితో ఉన్న కొండా సురేఖను బుజ్జగించేందుకే అధిష్ఠానం ఈ చర్యలు చేపట్టినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఆమెకు కేబినెట్ స్థాయి పదవిని అప్పగించే యోచనలో కాంగ్రెస్ పెద్దలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అధిష్ఠానం పిలుపు మేరకు కొండా సురేఖ ఢిల్లీ పర్యటన తర్వాత ఈ వ్యవహారంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# వినాయక మండపాలకు ఉచిత విద్యుత్.

మొదటి పేజీ తరువాయి..
నిర్వాహకులు అధికారులకు ముందస్తుగా దరఖాస్తు చేసుకుని ఈ ఉచిత విద్యుత్ సదుపాయాన్ని పొందొచ్చని సూచించారు. "స్థానిక పోలీస్ స్టేషన్లలో మండపాల సమాచారం ఇవ్వండి. దానివల్ల ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూసుకోవడమే కాకుండా, మన భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేయడానికి వీలవుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తూ... "మనం అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మ ఉత్సవాలకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నామో, గణేశ్



నిమజ్జనాలకు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పెద్ద క్రేన్లు పెట్టేందుకు వీలుగా చెరువు గట్లు, పరిసరాలను సిద్ధం చేయాలి" అని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి 24 గంటలూ పర్యవేక్షణ ఉండాలని, మున్సిపల్, పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. "హైదరాబాద్ ప్రశాంతంగా, సురక్షితంగా ఉంటేనే మన రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తాయి, మన పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి. అందుకే శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. మండపాల నిర్వాహకులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

# ధరణి పేరుతో బీఆర్ఎస్ భూదందా

**జనం వాయిస్, హైదరాబాద్, సెప్టెంబర్ 12:**
గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని లక్షలాది ఎకరాల భూములను ఆక్రమించిందని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. శనివారం శాసనసభలో 22-ఏ నిషేధిత భూములపై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల ఆస్తులకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించడమే తమ ప్రభుత్వ రెవెన్యూ సంస్కరణల ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ రెవెన్యూ శాఖను తన వద్దే ఉంచుకుని భూ అక్రమాలకు పాల్పడ్డారని పొంగులేటి విమర్శించారు. రాష్ట్రంలోని 2.49 కోట్ల ఎకరాల భూమిని తమ సొంత ఆస్తిగా భావించి గత ప్రభుత్వం పాలన సాగించిందని దుయ్యబట్టారు. ధరణి పోర్టల్ నిర్వహణను దివాలా తీసిన ఒక విదేశీ కంపెనీకి అప్పగించారని, పోర్టల్‌పై ఉన్న నియంత్రణను దుర్వినియోగం చేస్తూ అర్ధరాత్రి వేళల్లో రిజిస్ట్రేషన్లు చేశారని ఆరోపించారు. పోర్టల్‌లోని సాంకేతిక లోపాల వల్ల లక్షలాది మంది రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చిందని, ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై వందలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబం, వారి బంధువులు మాత్రమే లబ్ధి పొందారని, సామాన్య ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. శాసనసభ సాక్షిగా తమ అక్రమాలు బయటపడుతుండటంతోనే గత పాలకులు చర్చ



నుంచి పారిపోతున్నారని పొంగులేటి ఎద్దేవా చేశారు. భూ పరిపాలన, ధరణి పోర్టల్ అంశాలపై సభలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది.

# 25,000 క్యాబ్ డ్రైవర్ల సమ్మె.. శంషాబాద్‌లో ప్రయాణికులకు ఇబ్బందులు

**జనం వాయిస్, హైదరాబాద్, సెప్టెంబర్ 12:**
హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ)లో క్యాబ్ సేవలు పూర్తిగా స్తంభించిపోయాయి. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ (టీజీపీడబ్ల్యూయూ) ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం నుంచి దాదాపు 25,000 మంది క్యాబ్ డ్రైవర్లు సమ్మె చేపట్టారు. ఓలా, ఉబెర్, రాపిడో వంటి ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఎయిర్‌పోర్ట్ ట్రిప్పులను డ్రైవర్లు పూర్తిగా బహిష్కరించారు. ప్రభుత్వం 2022 డిసెంబర్ 9న జారీ చేసిన జీవో 46ను తక్షణమే అమలు చేయాలన్నది డ్రైవర్ల ప్రధాన డిమాండ్. ఈ జీవో ప్రకారం, ఎయిర్‌పోర్ట్ ప్రీపెయిడ్ సర్వీసులకు కిలోమీటరుకు రూ. 21 చొప్పున ఛార్జీలు



చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ప్రస్తుతం తమకు కిలోమీటరుకు కేవలం రూ. 12 నుంచి రూ. 15 మాత్రమే అందుతున్నాయని యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ ఆరోపించారు. ఈ అంశంపై ఆగస్టు 31న కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ ఆధ్వర్యంలో యూనియన్ ప్రతినిధులు, కంపెనీల యాజమాన్యాలతో కీలక సమావేశం జరిగింది. జీవో నిబంధనల ప్రకారం ఛార్జీలు చెల్లించాలని అధికారులు ఆదేశించినప్పటికీ, సదరు కంపెనీలు వాటిని బేఖాతరు చేశాయని యూనియన్ ఆవేదన వ్యక్తం చేసింది. "మేము ఎలాంటి ప్రత్యేక సౌకర్యాలు కోరడం లేదు. మాకు దక్కాల్సిన చట్టబద్ధమైన ఛార్జీలతో పాటు వృత్తిపరమైన గౌరవం, సమానత్వం కావాలి" అని అన్నారు. ఈ సమస్యలపై సమగ్రంగా చర్చించి, లిఖితపూర్వక హామీ ఇచ్చేందుకు ప్రభుత్వం వెంటనే సంబంధిత భాగస్వామ్య పక్షాలతో సమావేశం ఏర్పాటు చేయాలని యూనియన్ విజ్ఞప్తి చేసింది.

# కొత్త రైళ్ల కొనుగోలుకు పచ్చజెండా



మొదటి పేజీ తరువాయి..
ప్రవేశపెట్టనుంది. తొలి దశలో 60 కోచ్‌లను కొనుగోలు చేయనుండగా.. ఆరు కోచ్‌లతో కూడిన 10 కొత్త రైళ్లను అందుబాటులోకి తీసుకొస్తారు. ఒక్కో రైలుకు రూ.60 కోట్ల వరకు ఖర్చు కానుంది. 60 కోచ్‌ల కొనుగోలుకు రూ.600 కోట్ల వరకు వ్యయం కానుందని అంచనా వేశారు. త్వరలోనే కొత్త రైళ్ల కోసం టెండర్లను ఆహ్వానించనున్నారు. బిడ్ల కోసం నోటిఫికేషన్ జారీ చేసిన తర్వత తుది వ్యయం ఎంత అవుతుందనేది తెలియనుంది. ప్రస్తుతం ఉన్న మెట్రో రైళ్లల్లో మూడు కోచ్‌లు మాత్రమే అందుబాటులోకి ఉన్నాయి. దీంతో ఒకేసారి వెయ్యి మంది మాత్రమే ప్రయాణించడానికి వీలు కలుగుతుంది. అదే ఆరు కోచ్‌లు అందుబాటులోకి వస్తే ఒకేసారి 2 వేల మంది ప్రయాణించవచ్చు. ప్రయాణికుల సంఖ్య దాదాపు రెట్టింపు అవుతుంది. వీటి వల్ల ఒకేసారి ఎక్కువమంది ప్రయాణికులకు తమ గమ్యస్థానాలకు చేర్చవచ్చు. ఎక్కువ కోచ్‌లు కలిగిన రైళ్లు ఉండటం వల్ల ప్రయాణికుల రద్దీ కూడా తగ్గుతుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ విపరీతంగా ఉండటం వల్ల కనీసం అడుగు వేసేందుకు కూడా ఖాళీ స్థలం ఉండటం లేదు. దీని వల్ల ఇబ్బంది పడుతూ ప్రయాణం చేయాల్సి వస్తోంది. కొన్నిసార్లు తర్వాతి రైలు కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. ప్రస్తుతం మెట్రోలో రోజూ 4.5 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. అయితే కొత్త మెట్రో రైళ్లు వస్తే 6 లక్షల వరకు పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. అమీర్ పేట-రాయదుర్గం మార్గంలో ఎక్కువ రద్దీ ఉంటుంది. ఉదయం ఆఫీసులకు వెళ్లే సమయంలో, సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చే సమయాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల రాయదుర్గం స్టేషన్‌లో కొన్నిసార్లు ప్రయాణికులకు కొద్దిసేపు ఆపాల్సి వస్తోంది. రద్దీని నియంత్రించేందుకు అధికారులు ఈ ప్రయత్నం చేస్తున్నారు. దీంతో కొత్త రైళ్లను తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇవి అందుబాటులోకి వస్తే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. సౌకర్యవంతంగా ప్రయాణం చేయవచ్చు.

# 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే తెలంగాణ లక్ష్యం: శ్రీధర్ బాబు

**జనం వాయిస్, హైదరాబాద్, సెప్టెంబర్ 12:**
హైదరాబాద్ నగరంలో రాబోయే 20 నుంచి 30 ఏళ్ల భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా వికేంద్రీకృత నగర పాలనను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఇందుకోసమే ప్రత్యేకంగా 'క్యూర్ (జఖ=జు) యాక్ట్- 2026' శాసనాన్ని రూపొందించినట్లు శాసనసభలో ఆయన వెల్లడించారు. నగర పరిపాలనను మరింత వేగవంతంగా, పారదర్శకంగా, ప్రజా సమన్వయంతో ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా తీర్చిదిద్దడమే ఈ కొత్త చట్టం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. 'తెలంగాణ రైజింగ్ 2047' పాలసీ విజన్‌లో భాగంగా 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చాటిచెప్పారు. చార్మినార్ నుంచి హైటెక్ సిటీ వరకు, మూసీ తీరం నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు ప్రపంచ స్థాయి మెట్రోపాలిటన్ నగరంగా హైదరాబాద్ ఎదిగిందని మంత్రి కొనియాడారు. ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డేటా సెంటర్లు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు (+జజ) ప్రధాన కేంద్రంగా మారిన హైదరాబాద్... రాష్ట్ర ఆర్థిక రంగానికి ప్రధాన గ్రోత్ ఇంజన్ అని గుర్తుచేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర జీఎస్‌డీపీ 10.7 శాతం వృద్ధితో రూ.17.82 లక్షల కోట్లకు చేరిందని... ఇందులో క్యూర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలే సింహభాగం భాగస్వామ్యం వహిస్తున్నాయని ఆర్థిక గణాంకాలతో వివరించారు. ప్రస్తుతం నగరం ఔటర్ రింగ్ రోడ్డు వరకు వేగంగా విస్తరించిన నేపథ్యంలో మౌలిక సదుపాయాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఓఆర్ఆర్ పరిధికి ప్రత్యేక కార్యనిర్వాహక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు ప్రకటించారు. తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, ప్రజా రవాణా, ట్రాఫిక్ నివారణ, చెత్త నిర్వహణ, వరదల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ వంటి కీలక శాఖలను ఒకే గొడుగు కిందకు తెచ్చి నగరపాలనను అంతర్జాతీయ ప్రమాణాలకు చేర్చడమే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు.



PRGI NO: TGTEL/26/A0383
డైనమిక్ జనంవాయిస్ NEWS
తెలుగు దినపత్రిక
నిజం మా మాట | న్యాయం మా ధ్యేయం | ప్రజల కోసం మా ప్రయాణం

# ఎన్టీఆర్ స్టేడియంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం

## ... ప్రతి రెండో శనివారం పరిశుభ్రత కార్యక్రమం చేపడుతున్న కాళోజీ వాకర్స్ అసోసియేషన్



**మహబూబాబాద్, సెప్టెంబర్ 12 : (జనం వాయిస్) :**
కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి సుమారు గంటపాటు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు స్టేడియం పరిసరాలను శుభ్రం చేశారు. స్టేడియంలో నలువైపులా పడివున్న విస్తరాకులు, వాటర్ బాటిల్స్, కూల్‌డ్రింక్స్ బాటిల్స్, ఐస్‌క్రీమ్ కప్పులు, పేపర్ ప్లేట్లు, చాక్లెట్ పేపర్లు తదితర వ్యర్థాలను సేకరించి మున్సిపల్ సిబ్బందికి అందజేశారు. అనంతరం స్టేడియంలోని వివిధ రకాల చెట్లకు మున్సిపల్ వాటర్ ట్యాంకర్ సహకారంతో నీటిని అందించారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నామిరెడ్డి వెంకటరెడ్డి, ముఖ్య సలహాదారు మైస శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి రెండో శనివారం ఎన్టీఆర్ స్టేడియంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య పరిరక్షణతో పాటు పరిసరాల పరిరక్షణకు కూడా అసోసియేషన్ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. స్టేడియానికి వివిధ కార్యక్రమాల కోసం వచ్చే వారు వాటర్ బాటిల్స్, విస్తరాకులు, కూల్‌డ్రింక్స్ బాటిల్స్ తదితరాలను ఎక్కడపడితే అక్కడ పడవేయకుండా చెత్తను నిర్దేశిత ప్రదేశాల్లో వేయాలని సూచించారు. పిల్లలు, క్రీడల కోసం వచ్చే యువత కూడా ఐస్‌క్రీమ్ కప్పులు, ఇతర వ్యర్థాలను స్టేడియంలో పడేయకుండా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. "ఈ గ్రౌండ్ మన అందరిదీ.. దీనిని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత కూడా మనందరిదే" అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మున్సిపల్ కమిషనర్ పెద్దలు వినోద్ కుమార్ పాల్గొని వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు తమ వంతు సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పట్టాభి లక్ష్మయ్య, కోశాధికారి సోమ విష్ణువర్ధన్, పెద్ది వెంకన్న, శ్రీహరి, వెంకన్న, మహేందర్ రెడ్డి, ప్రభాకర్, శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, బిక్షం, రాంబాబు, రాజన్న, దేవేందర్ రెడ్డి, రామకృష్ణ రావు, శ్రీనివాస్, ఎంఎస్ రెడ్డి, రవీందర్, లక్ష్మీనారాయణ, ఐలేష్, ఉపేందర్, మల్లయ్య, దామోదర్ రెడ్డి, బి.రాజు, వెంకటేశ్వర్లు, విద్యాసాగర్, దామోదర్, రామకృష్ణ, తోలం వెంకటేశ్వర్లు, పగడయ్య, నాగేశ్వరరావు, నాగరాజు, రాధాకృష్ణ, నేరెళ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యను కేంద్రీకరిస్తే ఊరుకోం..!

- ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉండాల్సిందే.
- ఒక్క తరగతి.. ఒక్క గది.. ఒక్క ఉపాధ్యాయుడు ఉండాల్సిందే.
- ప్రభుత్వ విద్యను బలహీనపరిచే విధానాలను వెంటనే ఉపసంహరించాలి.
- ప్రైవేటీకరణకు అడ్డుకట్ట.. కామన్ స్కూల్ విధానమే పరిష్కారం.
- టి.ఎస్.ఇ.సి రాష్ట్ర నాయకులు మైస. శ్రీనివాసులు డిమాండ్.



**మహబూబాబాద్, సెప్టెంబర్ 12 (జనం వాయిస్) :**
రాష్ట్రంలో విద్యను కేంద్రీకృతం చేసే విధానాలను ప్రభుత్వం వెంటనే విడనాడాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ (టి.ఎస్.ఇ.సి) రాష్ట్ర నాయకులు మైస. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. శనివారం మహబూబాబాద్‌లో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో "తెలంగాణలో విద్యారంగ సంక్షోభం--సవాళ్లు--కర్తవ్యాలు" అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. టీపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి టి.ఎస్.ఇ.సి జిల్లా అధ్యక్షులు బలాష్టి రమేష్ అధ్యక్షత వహించారు. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మైస. శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రజలు కోరని కొత్త విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తూ విద్యను కేంద్రీకృతం చేయడం సరైన విధానం కాదన్నారు. ఇది ప్రజాస్వామిక సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు, సరిపడా ఉపాధ్యాయులను కల్పించకుండా రకరకాల పేర్లతో కొత్త పాఠశాలలను తీసుకురావడం కామన్ స్కూల్ విధానానికి విరుద్ధమని అన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యాబోధన మెరుగుపడాలంటే ప్రతి తరగతికి ఒక గది, ఒక ఉపాధ్యాయుడు ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించకుండా ఎన్ని కొత్త పాఠశాలలు ఏర్పాటు చేసినా ఆశించిన ఫలితాలు సాధ్యం కావన్నారు. "ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక వసతులు కల్పించకుండా కొత్త పాఠశాలల పేరుతో విద్యను కేంద్రీకృతం చేయడం ఎండమావిని చూసి నీరని భ్రమపడడమే" అని శ్రీనివాసులు ఘాటుగా వ్యాఖ్యానించారు.

### ప్రభుత్వ విద్య కోసం ప్రజా ఉద్యమం

తెలంగాణలో ప్రభుత్వ విద్యను కాపాడుకోవడానికి విస్తృతమైన ప్రజా ఉద్యమం అవసరమని ఆయన అన్నారు. ప్రతి రాజకీయ పార్టీ విద్యా పరిరక్షణ ఉద్యమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. విద్యా ప్రైవేటీకరణను అడ్డుకోవడంతో పాటు విద్యార్థులందరికీ సమాన విద్యా అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వం విధానాలను రూపొందించాలని డిమాండ్ చేశారు. విద్యారంగంలో అంతరాలను తొలగించి అందరికీ సమాన విద్యా అవకాశాలు కల్పించాలంటే కామన్ స్కూల్ విధానమే సరైన పరిష్కారం అని, అది బలమైన విద్యా ఉద్యమం ద్వారానే సాధ్యమవుతుందని మైస. శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టి.ఎస్.ఇ.సి మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నెల్లుట్ల, సిపిఐ (ఎంఎల్ ) మాస్ లైన్ నాయకులు కొత్తపల్లి రవి, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ రాజు, రిటైర్డ్ గెజిటెడ్ హెడ్‌మాస్టర్ బందెల రాజు, పిడిఎస్యు నాయకులు బోనగిరి మధు, చైతన్య, మహేష్, ఎస్కే షబ్బీర్, పిటిఎఫ్ మహబూబాబాద్ మండల ప్రధాన కార్యదర్శి సి. రామలింగారెడ్డి, టీపీటీఎఫ్ నాయకులు ప్రకాష్, లక్ష్మయ్య, భీముడు తదితరులు పాల్గొన్నారు.

# రైతు కష్టానికి మద్దతు ధర గ్యారెంటీ ఏదీ..?

- ఎరువుల ధరలు పెరుగుతున్నా పంటలకు ధరలు పెరగడం లేదు.
- ధరణి స్థానంలో భూభారతి తీసుకొచ్చినా రైతుల సమస్యలు పరిష్కారం ఏది?.
- రుణమాఫీ, రైతు భరోసాపై రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసిన రైతు సంఘం.
- నల్గొండలో నవంబర్ 15న లక్ష మందితో భారీ బహిరంగ సభ.
- రైతు సమస్యలపై దేశవ్యాప్త ఉద్యమానికి మహాసభలు వేదిక.
- పార్లమెంటులో ప్రత్యేక చట్టం చేయాలి : పోతినేని సుదర్శన్.




**మహబూబాబాద్, సెప్టెంబర్ 12 (జనం వాయిస్):**
రైతులు పండించిన అన్ని రకాల పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కు చట్టబద్ధమైన గ్యారెంటీ కల్పించేలా పార్లమెంటులో ప్రత్యేక చట్టం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ డిమాండ్ చేశారు. నవంబర్ 15 నుంచి 18 వరకు నల్గొండలో జరిగే అఖిలభారత రైతు మహాసభలు రైతుల సమస్యలపై దేశవ్యాప్త ఉద్యమానికి వేదిక కానున్నాయని తెలిపారు. సారంపల్లి మల్లారెడ్డి నగర్‌లోని నీలకుర్తి సీతారెడ్డి ప్రాంగణంలో శనివారం తెలంగాణ రైతు సంఘం మహబూబాబాద్ జిల్లా మహాసభలు గుణగంటి రాజన్న, నంబూరి మధు అధ్యక్షతన జరిగాయి. సీనియర్ రైతు సంఘం నాయకులు మార్తినేని పాపారావు రైతు సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రారంభ సభలో సుదర్శన్ మాట్లాడుతూ రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రైతు సంఘం నిరంతర ఉద్యమాలు కొనసాగిస్తుందని అన్నారు. అమెరికా--భారత్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం దేశ స్వాతంత్ర్యం, సార్వభౌమత్వానికి విఘాతం కలిగించే విధంగా ఉందని ఆరోపించారు. వ్యవసాయ రంగాన్ని రక్షించేందుకు పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన రైతు ఉద్యమంలో రైతు సంఘం కీలక పాత్ర పోషించిందన్నారు. 440 రైతు సంఘాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఉద్యమాన్ని బలోపేతం చేశామని పేర్కొన్నారు. ఉద్యమ సమయంలో 756 మంది రైతులు మృతి చెందారని, దీనికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రైతు ఉద్యమం విరమణ సందర్భంగా ప్రధాని మోదీ ఇచ్చిన రాతపూర్వక హామీలను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. విద్యుత్ సవరణ చట్టం, ఎరువుల విధానం, పంటల బీమా, నూతన నీటి విధానాల ద్వారా కార్పొరేట్లకు లాభం చేకూర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఎరువులు, పురుగుమందుల ధరలు పెరుగుతున్నా రైతు పంటలకు సరైన ధర లభించడం లేదని, దీంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని విమర్శించారు. రెండు లక్షల రూపాయల రుణమాఫీ, రైతు భరోసా వంటి పథకాల అమలులో రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ధరణి స్థానంలో భూభారతి తీసుకొచ్చినా రైతుల సమస్యలు పరిష్కారం కావడం లేదని అన్నారు. పత్తి, మొక్కజొన్న కొనుగోళ్లకు సీలింగ్ విధించడం వల్ల రైతులు నష్టపోతున్నారని ఆరోపించారు. యూరియా, పత్తి యాప్‌ల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయడం మానుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

### నల్గొండలో లక్ష మందితో సభ

అఖిలభారత రైతు మహాసభల సందర్భంగా నవంబర్ 15న నల్గొండలో లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సుదర్శన్ తెలిపారు. మహాసభలను విజయవంతం చేసేందుకు మహబూబాబాద్ జిల్లా నుంచి పెద్ద ఎత్తున రైతులను సమీకరించాలని పిలుపునిచ్చారు. మహాసభ సందర్భంగా జిల్లా కార్యక్రమాల నివేదికను కార్యదర్శి శెట్టి వెంకన్న ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సాదుల శ్రీనివాస్, రైతు సంఘం నాయకులు ఆకుల రాజు, సమ్మెట రాజమౌళి, నల్లపు సుధాకర్, గడ్డిపాటి రాజారావు, బొబ్బల యాకోబు రెడ్డి, బొల్లం అశోక్, బొబ్బ వెంకట్ రెడ్డి, జక్కుల మల్లయ్య, దుడ్డేల రామమూర్తి, నక్క సైదులు తదితరులు పాల్గొన్నారు.


# పోగొట్టుకున్న మొబైల్ ను యాదగిరికి అందజేసిన ఎస్సై సృజన్ కుమార్..

**సెప్టెంబర్ 12 జనం వాయిస్ పాలకుర్తి:**
దేవరుప్పుల మండలం,రాంబోజి గూడెం గ్రామానికి చెందిన రాంపల్లి యాదగిరి అనే వ్యక్తి తన మొబైల్ ను ఆగస్టు 23న పోగొట్టుకొని స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు.దేవరుప్పుల ఎస్సై ఊర సృజన్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది మొబైల్ ను సిఈఐఆర్ ద అనే సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ట్రై చేసి మొబైల్ ను వెతికారు.ఈరోజు యాదగిరిని పోలీస్ స్టేషన్ కి రప్పించి అతనికి మొబైల్ ను అందజేసిన ఎస్సై సృజన్ కుమార్.వారితో పాటు సిబ్బంది యాకుబ్ ఉన్నారు.




# మృతుల కుటుంబాలను పరామర్శించిన: పల్లా సుందర్ రాంరెడ్డి

**సెప్టెంబర్ 12 జనం వాయిస్ పాలకుర్తి:**
దేవరుప్పుల మండలం, నీర్మాల గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు కట్ట ఐలయ్య, ఇటీవల మరణించగా వారి కుటుంబాన్ని, అలాగే నాగట్టి సిద్దయ్య కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి వారి ఇంటికి వెళ్ళి మరణించిన వారి చిత్రపటాలకు పూలు చల్లి వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. వారి వెంట బిఆర్ఎస్ నాయకులు ఇంటి మల్లారెడ్డి, మేడ రామ్ దయాకర్, మేడ చిరంజీవి, మేడ రాంచందర్,బింగి శ్రీనివాస్, వడ్లకొండ నరేష్, మేడ శ్రీను, మేడ శేఖర్, వడ్లకొండ శ్రీకాంత్,తదితర బీఆర్ఎస్ గ్రామ నాయకులున్నారు.



# సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

### బీజేపీ నాయకుడు అమీరిశెట్టి రాజుకుమార్ డిమాండ్

**జనం వాయిస్, మంచిర్యాల, సెప్టెంబర్ 12:**
సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ గర్మిళ్ల జోన్ అధ్యక్షుడు అమీరిశెట్టి రాజుకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మంచిర్యాల తహసీల్దార్‌కు బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజుకుమార్ మాట్లాడుతూ.. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ సంస్థానం నిజాం పాలనలో కొనసాగిందన్నారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా ప్రజలు, రైతులు, మహిళలు సాగించిన పోరాటం చరిత్రలో కీలక ఘట్టమని పేర్కొన్నారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ నేతృత్వంలో చేపట్టిన 'ఆపరేషన్ పోలో' అనంతరం 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైందన్నారు. సెప్టెంబర్ 17 కేవలం ఒక తేదీ కాదని, తెలంగాణ ప్రజల పోరాటం, త్యాగాలకు ప్రతీకగా నిలిచిన చారిత్రక రోజని అన్నారు. కేంద్ర ప్రభుత్వం విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కూడా అధికారికంగా నిర్వహించాలని కోరారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న విధంగానే తెలంగాణలోనూ కార్యక్రమాలను అధికారికంగా చేపట్టి, అప్పటి ప్రజల పోరాట చరిత్రను భావితరాలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్ బోట్ల సత్యం, జిల్లా మీడియా ఇన్‌చార్జి పల్లి రాకేష్, గర్మిళ్ల జోన్ ప్రధాన కార్యదర్శి మేడికొండ శ్రీనివాస్, కర్రె లచ్చన్న, తూటి సరస్వతి, తరుణ్ సింగ్, రాకేష్ రైన్వా, పచ్చ వెంకటేశ్వర్లు, ఓం నమశ్శివాయ తదితరులు పాల్గొన్నారు.



# 800 గ్రాముల పసికందుకు పునర్జన్మ.

- 1కిలో 600 గ్రాములతో తల్లి ఒడికి!
- తనయ చిల్డ్రన్ హాస్పిటల్ అద్భుత వైద్యం!

**జనం వాయిస్,హనుమకొండ,సెప్టెంబర్ 12:**
వైద్యాన్ని వ్యాపారంగా కాకుండా సేవగా అందిస్తూ అందరికీ అందుబాటులో వైద్యం అందిస్తోంది తనయ చిల్డ్రన్ హాస్పిటల్. అతి తక్కువ బరువుతో పుట్టిన పసికందును ప్రాణాపాయం నుండి కాపాడి, ఆరోగ్యంగా తీర్చిదిద్దడంలో తనయ వైద్య బృందం మరో అద్భుతాన్ని సృష్టించింది.తనయ చిల్డ్రన్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా. అర్జున్ రెడ్డి ఆధ్వర్యంలో, కేవలం 800 గ్రాముల బరువుతో పుట్టిన నెలలు నిండని శిశువును తనయ చిల్డ్రన్ హాస్పిటల్ లో చేర్పించగా, అక్కడి నిపుణులైన పీడియాట్రిక్ వైద్యులు డా. రసజ్ఞ రెడ్డి, డా. హర్షవర్ధన్ ప్రత్యేక పర్యవేక్షణలో అధునాతన చికిత్స అందించారు. నిరంతర కృషి, అధునాతన వైద్య సేవల ఫలితంగా ఆ పసికందు బరువు 1 కిలో600 గ్రాములకు పెరిగి సంపూర్ణ ఆరోగ్యంతో తల్లిదండ్రుల చెంతకు చేరింది.



### అతి తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం

ఖరీదైన కార్పొరేట్ హాస్పిటల్స్ లో లక్షల రూపాయలు ఖర్చయ్యే ఇలాంటి చికిత్సను తనయ చిల్డ్రన్ హాస్పిటల్ లో అతి తక్కువ ఖర్చుతో అందించడం విశేషం. హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా. అర్జున్ రెడ్డి లక్ష్యం ప్రకారం పేద, మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటు ధరలోనే కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తుండటంతో తనయ అంటేనే అందరికీ వైద్యం అనే నమ్మకం ప్రజల్లో బలంగా నాటుకుపోయింది.

ఈ సందర్భంగా పసికందు తల్లిదండ్రులు తనయ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా. అర్జున్ రెడ్డి కి, వైద్యులు డా. రసజ్ఞ రెడ్డి డా. హర్షవర్ధన్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

### తక్కువ ఖర్చుతోనే మా బిడ్డకు ప్రాణం పోశారు: తల్లి హవేలీ రాణి

"బిడ్డ చాలా తక్కువ బరువుతో పుట్టడంతో మేము చాలా భయపడ్డాము. బతుకుతుందో లేదో అనే ఆందోళనలో ఉన్నాము. తనయ హాస్పిటల్ లో మేనేజింగ్ డైరెక్టర్ డా. అర్జున్ రెడ్డి ఆధ్వర్యంలో డా. రసింగారెడ్డి, డా. హర్షవర్ధన్ మాకు ధైర్యం చెప్పి, అత్యంత జాగ్రత్తగా చూసుకున్నారు. అతి తక్కువ ఖర్చుతోనే మా బిడ్డకు ప్రాణం పోశారు. తనయ ఆసుపత్రి వారికి జీవితాంతం రుణపడి ఉంటాము" అని ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# జాతీయ లోక్‌అదాలత్‌లో 3,500కు పైగా కేసుల పరిష్కారం




**జనం వాయిస్, మంచిర్యాల, సెప్టెంబర్ 12:**
మంచిర్యాల జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 3,500కు పైగా కేసులు పరిష్కరించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎ. వీరయ్య తెలిపారు. రాజీమార్గమే రాజమార్గమని, ఇరు వర్గాలు పరస్పర అంగీకారంతో కేసుల నుంచి విముక్తి పొందవచ్చన్నారు. జిల్లా వ్యాప్తంగా తొమ్మిది లోక్‌అదాలత్ బెంచ్‌లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. లోక్‌అదాలత్ ద్వారా సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు అప్పీల్‌కు అవకాశం లేకుండా తుది పరిష్కారం లభిస్తుందన్నారు. ఇందులో 32 సివిల్, 3,300కు పైగా క్రిమినల్ కేసులతో పాటు సైబర్ క్రైమ్‌కు సంబంధించిన రెండు కేసుల్లో రూ.17 వేల పరిష్కారం, 16 బ్యాంకు ప్రిలిటిగేషన్ కేసుల్లో రూ.9.84 లక్షల పరిష్కారం సాధించారు. కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. కవిత, ఏ. నిర్మల, సీనియర్ సివిల్ జడ్జి డి. రామమోహన్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్త సత్తయ్య, పోలీసు లైజన్ అధికారి సీహెచ్. వెంకటేశ్వర్లు, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మల్లమ్మ కుటుంబాన్ని పరామర్శించిన సమ్మయ్య గౌడ్

**మహబూబాబాద్, సెప్టెంబర్ 8 (జనం వాయిస్) :**
కేసముద్రం మండలం కల్వల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కూన భద్రాద్రి తల్లి, ప్రముఖ పాత్రికేయులు కూన శ్రీనివాస్ నానమ్మ కూన మల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ కేసముద్రం మండల అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ మంగళవారం వారి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మల్లమ్మ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మల్లమ్మ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో సమ్మయ్య గౌడ్‌తో పాటు సామల నరసయ్య, కూన సారయ్య, మంద విక్రమ్, నీలం సుమన్, రవి తదితరులు పాల్గొన్నారు.

